

# చలితోనూ పంటలకు ముప్పే

## యాసంగి సాగులో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

- చలితీవ్రతతో ఏర్పడే జింక్ లోపాన్ని నివారించుకోవాలి
- మొక్కజొన్నకు అధిక నీరు అందించకూడదు
- వేరుశనగకు తగిన జిప్సం అందించాలి
- గడ్డిపల్లి కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్

**వివిధ పంటల సాగులో సరియైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. డిసెంబర్- జనవరిలో వివిధ పంటల్లో అనుసరించాల్సిన పద్ధతులను గడ్డిపల్లి కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్ వివరించారు. అదనపు సమాచారం కోసం 9290615952 నంబర్‌ను సంప్రదించవచ్చు. వివిధ పంటల్లో ఆచరించాల్సిన పద్ధతులు ఆయన మాటల్లోనే..**

– గరిడేపల్లి, డిసెంబర్ 28

### కంది



వానకాలం పంటగా వేసిన దీర్ఘకాలిక కంది రకాలు పూత, కాయ ఏర్పడే దశలో ఉన్నందున శనగపచ్చ పురుగు, మారుకా మచ్చల పురుగు ఎక్కువగా ఆశించి పంటను నాశనం చేస్తాయి. కావున శనగపచ్చ పురుగు నివారణకు తొలిదశలో క్లోరోపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు, క్వినాల్‌ఫాస్ 2 మిల్లీ లీటర్లు, లేదా ఎసిఫేట్‌ను 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా క్లోరాంథ్రానిలిప్రోల్ 60 మిల్లీ లీటర్లు, వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును వాడిన తర్వాత కూడా శనగపచ్చ పురుగు ప్రభావం తగ్గకపోతే ఇండాక్సాకార్బ్ 1 మిల్లీ లీటర్లు, లేదా 0.3 మిల్లీ లీటర్లు, స్పైనోసాడ్ లేదా 0.3 మి.లీల క్లోరాంథ్రానిలిప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

#### మారుకా మచ్చల పురుగు

ఈ పురుగు ఆకులను పూతనంతా ఒక దగ్గరకు చేర్చి గూడుగా మార్చి నష్టపరుస్తున్నది. దీని నివారణకు క్లోరోఫైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు, 1మిల్లీ లీటర్ డైక్లోరోవాస్ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పురుగు తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నట్లైతే థయోడికార్బ్ 1 గ్రాము లేదా స్పైనోసాడ్/ ఫ్లూ బెండమైడ్ 0.3 మిల్లీ లీటర్లు, చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

### పొద్దుతిరుగుడు

ఆరుతడి పంటగా నవంబర్‌లో వేయడానికి వీలు గానీ పరిస్థితుల్లో ఈ నెల వచ్చే నెలలో విత్తుకోవచ్చు. హైబ్రిడ్ రకాలను సాగు చేసుకోవడం మంచిది. హైబ్రిడ్ రకాలలో కేబీఎస్‌హెచ్-44, ఎన్‌డీఎస్‌హెచ్-1, డీఆర్‌ఎస్‌హెచ్-1, ఏపీఎస్‌హెచ్-66 రకాలు అనువైనవి. నవంబర్‌లో విత్తిన పైరుకు విత్తిన తేదీని బట్టి 30-35 రోజుల్లో హెక్టారుకు 40 కిలోలను ఇచ్చు నత్రజని ఎరువులు వేయాలి.



### వరి

నవంబర్‌లో పోసిన వరి నారును ఈనెలలో నాటుకోవాలి. రసాయనాలతో కలుపు నివారణకు ఏక వార్షిక గడ్డి, తుంగజాతి కలుపు సమస్య ఉంటే బ్యూటక్లోర్‌ను హెక్టారుకు 2.5 నుంచి 3 లీటర్లు లేదా అనిలోగార్డ్ 1.25 లీటర్లు 10 కిలోల ఇసుకలో కలిపి నాటిన 3- 5 రోజుల్లో పొలంలో అంగుళం వరకు నీరు ఉంచి సమానంగా చల్లాలి. ఊద సమస్య అధికమైతే బెంథియోకార్బ్ హెక్టారుకు 3 లీటర్లు 100 కిలోల ఇసుకలో కలిపి సమానంగా చల్లాలి. వెదజల్లే పద్ధతిలో గానీ, డ్రమ్ సీడర్‌తో గానీ విత్తనాలు వేస్తే 15-20 రోజులకు కలుపు మందు పిచికారీ చేసుకోవాలి. దీనికి పెనాక్సిలమ్ 400 మిల్లీ లీటర్, బిస్‌పైరిబాక్ సోడియం 100 మిల్లి లీటర్లు ఎకరాకు లేదా పెనాక్సిలమ్ + సైహాలోపాప్ బ్యుటైల్ 800 మి.లీ, బిస్ పైరిబాక్ సోడియం 100 మిల్లీ లీటర్లు పిచికారీ చేస్తే గడ్డిజాతి, వెడల్పుకు జాతి మొక్కలు నశిస్తాయి. కలుపు మందు పిచికారీ చేసిన తదుపరి సుమారు 30 కిలోల యూరియాను ఎకరాకు అందించాలి. ప్రస్తుతం చలి తీవ్రత ఉన్నందున నారుమడిలో గానీ నేరుగా విత్తిన వరిలో గానీ జింక్ లోపం లక్షణాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. దీని నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలి. ఇక ఎరువులైతే హెక్టారుకు 120 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరం, 40 కిలోల పోటాష్‌ను ఇచ్చే ఎరువులు వేయాలి. నత్రజని మూడు సమభాగాలుగా నాట్లు వేసేటప్పుడు నాటు వేసిన 10-12 రోజుల్లో, మిగిలిన మూడవ భాగాన్ని అంకురార్పణ దశలో వేయాలి.



### కుసుమ

కుసుమ పంటకు విత్తిన 40-45 రోజుల వరకు పేను తాకిడి చాలా ప్రమాదకరమైంది. దీని నివారణకు డై మిథోయేట్ 2 మిల్లీ లీటర్లు, లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు, లేదా క్లోరోఫైరిఫాస్ 2.5మిల్లీ లీటర్లు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు పంట వేసిన 20 రోజుల నుండి పూత దశ వరకు ఆశిస్తుంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.


### మొక్కజొన్న



యాసంగి పంటగా నవంబర్ 15లోగా విత్తిన మొక్కజొన్న పైరు వయస్సు 35-40 రోజుల లోపు ఉన్నప్పుడు అంతర కృషి చేసి హెక్టారుకు 75 కిలోల నత్రజనిని ఇచ్చు ఎరువు వేయాలి. పై పాటు ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగిన తేమ ఉండేలా చూసుకోవాలి. 30-40 రోజులున్న పైరుకు అధిక నీరు హానికరం. గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా యాసంగి మొక్కజొన్నను ఆశిస్తుంది. పైరు మొలకెత్తిన 10-20 రోజుల నుంచి ఆశిస్తుంది. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ ఎకరాకు 320 మిల్లి లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు మొలకెత్తిన 25-30 రోజులకు ఆకు సుడులలో వేయాలి.

### శనగ

యాసంగిలో సాగు చేసిన శనగ పైరుకు ఈ నెలలో సాధారణంగా పచ్చపురుగు లేదా రబ్బరు పురుగు ఆశించి నష్టం కలుగజేస్తున్నది. వీటి నివారణకు తొలిదశలో 2.5 మిల్లీ లీటర్లు, క్లోరోఫైరిఫాస్ లేదా 2 మిల్లీ లీటర్లు, క్వినాల్‌పాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరమైనచో స్పైనోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు, లేదా డై ఫ్ల్యూ బెంజురాన్ 1 మిల్లీ లీటర్ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 1 లేదా 2 సార్లు పిచికారీ చేయాలి. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు వేసిన వేరుశనగ పైరు ప్రస్తుతం పూతదశలో ఉన్నందున చివరిసారిగా అంతర కృషి చేసి హెక్టారుకు 500 కిలోల జిప్సంను 5 సెం.మీల లోతులో మొక్క దగ్గర వేసి మట్టితో ఎగదోసి నీరుపెట్టాలి.



# మహిళలూ.. జర పైలం

**దొంగలు చేతివాటానికి అవకాశం**

**మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో పెరిగిన రద్దీ**

**అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు, ఆర్టీసీ అధికారులు**

నేరేడుచర్ల, డిసెంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మహాలక్ష్మి పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు వచ్చే బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రయాణ ప్రాంగణాల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండడంతో దీనిని అదునుగా తీసుకున్న చిల్లర దొంగలు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని పోలీసులు, ఆర్టీసీ అధికారులు హెచ్చరిస్తున్నారు. మహిళలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

### పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల తీవ్ర రద్దీ

వివిధ ప్రాంతాలకు ప్రయాణానికి మహిళలు ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తున్నారు. పల్లె వెలుగు బస్సులు ఎక్కువగా స్టాపులు ఉంటాయని, ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రయణానికి మొగ్గు చూపుతున్నారు. తక్కువ దూరం ప్రయాణించే వారే పల్లె వెలుగు బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఏ బస్సు వద్ద చూసినా మహిళా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది.

### దొంగల చేతివాటంతో జరభద్రం

మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో చిల్లర దొంతలు చేతివాటాన్ని ప్రదర్శించే అవకాశం ఉంది. ఇలాంటి దొంతనాలు గతంలో నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. ఇటువంటి రద్దీ సమయంలో ప్రయాణించే మహిళలు విలువైన నగలు ధరించకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. తమ హ్యాండ్ బ్యాగులో సైతం విలువైన వస్తువులు, ఖరీదైన మొబైల్ ఫోన్లు వెంట తీసుకెళ్లకపోవడమే ఉత్తమమని అంటున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్ల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించి నిఘా పెంచడంతో పాటు ఎప్పటికప్పుడు మైకుల ద్వార అప్రమత్తం చేస్తున్నారు. దీంతో పాటు సీసీ కెమెరాలు నిఘా సైతం ఏర్పాటు చేశారు.

### తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే

ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో చోరీ ఘటనలు ఎక్కువయ్యే అవకాశముంది. పరిచయం లేని వ్యక్తులు అందించే వాటర్ బాటిల్ నీరు, తిను బండారాలు వంటివి వాటికి దూరంగా ఉండటమే మంచిదని అదికారులు హెచ్చరిస్తున్నారు. బస్టాండ్ ప్రాంతాల్లో బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అనుమానితులు కనిపిస్తే ఆర్టీసీ భద్రతా సిబ్బందికి లేదా పోలీసులకు తెలపాలని సూచిస్తున్నారు.



నేరేడుచర్లలోని మిర్యాలగూడ బస్టాప్ వద్ద బస్సు ఎక్కుతున్న మహిళలు